## తిరుమలలో భక్తుల రద్దీ

**ప్రజాశక్తి- తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండిపోయాయి. శిలాతోరణం క్యూలైన్ వరకు భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి దర్శనానికి ప్రస్తుతం దాదాపు 24గంటల సమయం పడుతోంది. శనివారం 86,781మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. 44,920 మంది తలనీలాలు సమర్పించినట్లు తెలిపారు. శ్రీవారికి రూ.3.37కోట్ల హుండీ ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

**బ్రేక్ దర్శనం రద్దు**

శ్రీవారి ఆలయంలో జూలై 17వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 11వ తేదీన మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 11న బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా ఈనెల 10న సోమవారం సిఫారసు లేఖలు స్వీకరించబడవని టిటిడి స్పష్టం చేసింది. ఈవిషయాన్ని భక్తులు గమనించాలని కోరింది.

# విద్యాభివృద్ధి కోసమే నూతన సంస్కరణలు

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**ప్రజాశక్తి- సోమల:** రాష్ట్రంలో విద్యావ్యవస్థను నూతన పంథాలో ఉంచడానికి దేశంలో ఎక్కడ లేని విధంగా అభివద్ధి పథంలో తీసుకురావడానికి ముఖ్యమంత్రి జగన్ నూతన సంస్కరణలను తీసుకువస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన సదుం జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నూతనంగా ఈఏడాది ప్రారంభమైన జూనియర్ ఎంపీసీ, బైపీసీ తరగతులను ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పాఠశాల విద్యలో పెనుమార్పులను తీసుకువచ్చి నాడు- నేడు, విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, మధ్యాహ్నం భోజనం, తల్లులకు అమ్మ ఒడి, 9వ తరగతి విద్యార్థులకు ట్యాబుల పంపిణీ చేస్తున్నారని ఇందులో భాగంగానే ప్రతి మండల కేంద్రంలో బాలికలకు ఒక జూనియర్ కళాశాల చర్యలు చేపట్టారని అన్నారు. జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో ఇప్పటివరకు పదవ తరగతి వరకే చదువుకునే అవకాశం ఉండేదని ఇకపై జూనియర్ కళాశాల ఏర్పాటుతో విద్యార్థులు కళాశాల విద్యను కూడా ఇక్కడే అవలంబించే విధంగా చర్యలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. అనంతరం విద్యార్థులు, కళాశాల అధ్యాపక బందంతో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

**మల్లికార్జున ను ప్రశంసించిన మంత్రి**

సదుం మండలం నడిగడ్డ పంచాయతీ కురవపల్లెకు చెందిన మల్లికార్జున గిన్నిస్‌బుక్‌లో మూడుసార్లు స్థానం సంపాదించి నందుకుగాను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం మల్లికార్జునను ప్రత్యేకంగా అభినందించారు.

**చిరువ్యాపారస్తులకు సోలార్ లైట్లు : మంత్రి పెద్దిరెడ్డి**

**పుంగనూరు:** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదలపక్షాన ఉన్నాడని అర్హులైన ప్రతిఒక్కరికి పథకాల ఇస్తూ సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర భూగర్భ, విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తోపుడుబండ్లు కలిగిన చిరువ్యాపారులు రాత్రిపూట వ్యాపారం చేసేందుకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఉచితంగా సోలార్ లైట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ హలీంబాషా అధ్యక్షతన నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో 750 సోలార్ లైట్లు రూ.30 లక్షలతో పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సోలార్ లైట్లు తోపుడు బండ్ల వ్యాపారస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అర్హులైనవారు ప్రభుత్వ సంక్షేమపథకాల లబ్ది పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాల మంజూరు నిమిత్తం ప్రభుత్వం జగనన్న సురక్ష క్యాంపుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిత్తూరు ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంను పులివెందుల తరహాలో అభివద్ధి చేస్తున్న మంత్రి పుట్టిన బిడ్డ నుండి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. రాష్ట్ర జానపద కళలఅభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, ముడా చైర్మన్ ఎన్.వెంకటరెడ్డి యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు జింక చలపతి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు నాగేంద్ర, సిఆర్ లలిత పాల్గొన్నారు.



### సమస్యల సాధన కోసం కలెక్టరేట్ ఎదుట

# 36 గంటలు అంగన్వాడీల దీక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

**అంగన్వాడీలకు పోరాటం కొత్త కాదు.... జీతాలు, టిఏడిఏలు, పెన్షన్ సాధన కోసం పోరాడుతూనే సమగ్ర శిశుసంక్షేమ పథకం (ఐసిడిఎస్) ఉనికి ప్రమాదంలో పడ్డప్పుడు ఐసిడిఎస్‌ను కాపాడుకోవడం కోసం దేశవ్యాప్తంగా సిఐటియు నేతృత్వంలో అంగన్వాడీలు పెద్దఎత్తున ఉద్యమించారు. గుర్రాలతో తొక్కించినా వెనకడుకు వేయకుండా నాటి తెలుగుదేశం ప్రభుత్వానికి ముచ్చమలు పట్టించి అంగన్వాడీలు పోరాట పటిమ ఏపాటిదో తెలియజేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ వేతనాలతో స్కీమ్ వర్కర్లుగా అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, ఆయమ్మలు (హెల్పర్లు) పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతో కీలకపాత్ర పోషిస్తున్నారు. సిఐటియు అనుబంధ సంఘంగా ఎర్రజెండా అండతో దేశవ్యాప్తంగా అంగన్వాడీలు జీతాల పెంపు ఇతర సౌకర్యాల కోసం సుదీర్ఘ పోరాటాన్ని సాగిస్తున్నారు. పోరాటాలకు నెలసరి వేతనం రూ.2,500 నుంచి 3000 నుండి నేడు రూ.12వేలు సాధించుకున్నారు. హెల్పర్స్ రూ.7000లు జీతం పొందుతున్నారు.**

స్కీమ్ వర్కర్లుగా చాలీచాలనీ జీతాలతో బండెడు చాకిరీ చేస్తున్న అంగన్వాడీలకు ప్రభుత్వపథకాలు వర్తించవంటూ ప్రభుత్వం పొంతనలేని జీవోలతో వేధిస్తోంది. మరోవైపు పదవీ విరమణ తరువాత పెన్షన్ లేదు. నెలల జీతాలు అందడం లేదు, డిఏడిఏలు ప్రభుత్వం కరుణించినప్పుడే.... కూరగాలు, గ్యాస్ బిల్లులు మూడు నాలుగు నెలలకోసారి ప్రభుత్వం ఇస్తున్నా అప్పులు చేసి నెట్టుకొస్తున్నారు. తెలంగాణా, కేరళ, కర్నాటక వంటి రాష్ట్రాలో ఆంధ్రప్రదేశ్ కంటే జీతాలు ఎక్కువ ఇస్తున్నారు. జగన్ ప్రభుత్వం ఎందుకు పెంచదంటూ ప్రశ్నించేందుకు జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట 36గంటల దీక్షకు అంగన్వాడీలు పూనుకుంటున్నారు.

**అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు**

రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు తెలంగాణా కంటే అదనంగా జీతం చెల్లించాలి. సుప్రీమ్ కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, గ్రాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేసి వైఎస్ఆర్ సంపూర్ణపోషణ మెనూకు అనుణంగా కూరగాలయ బిల్లులు చెల్లించాలి. పదవీ వరమణ తరువాత ఐదు లక్షలు ఇచ్చి, వేతనంలో సంగం పెన్షన్ రూపంలో చెల్లించాలి, రాష్ట్రప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హులుగా ప్రకటించాలి. హెల్పర్స్‌కు 50సంవత్సరాలు ప్రమోషన్ పెంచి, రాజకీయ జోక్యం అరికట్టాలి. 300 జనాభా దాటిన సెంటర్లను మినిగా కాకుండా మైన్ సెంటర్‌గా గుర్తించాలి. వేతనంలో కూడిన ప్రసూతి సెలవు ఇవ్వాలి. ఐసిడిఎస్‌ను బలోపేతం చేసి పిల్లలకు యూనిఫాం, అమ్మఒడి అమలు చేయాలి. బీమా పథకాన్ని అమలు చేసి మరణించి వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలి. సీనియార్టీ ప్రకారం వేతనాలు చెల్లించాలి. గ్రేడ్ టూ సూపర్‌వైజర్ పోస్టులకు వయో పరిమితి తొలగించాలి. 164 గ్రేడ్ టూ సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి. అంగన్వాడీలను అవమానించేలా ఉన్న 1,2,9 కొత్త వర్షన్ ను వెంటనే రద్దు చేయాలి.

**సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి**

**- ఎస్.షకీల, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, జిల్లా కార్యదర్శి**

అంగన్వాడీల న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి. గతంలో పాదయాత్ర సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక హామీలు ఇచ్చారు. వాటిని అమలు చేయాలి. ఇతర రాష్ట్రాలతో సమానంగా వేతనం చెల్లించాలి. జీవిత కాలం అంగన్వాడీలుగా సేవలు అందించినా ప్రభుత్వం నుండి ఎలాంటి పెన్షన్, ప్రమాద ఉచిత బీమా, ప్రసూతి సెలవులు, పెన్షన్ వంటివి అమలు కావడం లేదు. ఇది చాలా దుర్మార్గం ప్రభుత్వం అమలు చేస్తున్న మాతా స్త్రీ శిశు సంక్షేమంలో పనిచేస్తున్న అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, ఆయాలు పనిచేస్తున్నారు. ఏండ్ల తరబడి చాలీచాలనీ జీతాలతో వెట్టి చాకిరీ చేస్తున్నారు. సుప్రీమ్ కోర్టు తీర్పులు అమలు కావడం లేదు. అందుకే కలెక్టరేట్ల ఎదుట 36 గంటల దీక్షలకు పిలుపునిచ్చాం.

**మాటలకే పరిమితం..**

**- కె. సురేంద్రన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి**



జగన్ ప్రభుత్వం మాటకే పరిమితం అవుతోంది. పాదయాత్ర సందర్భంగా అనేక హామీలు ఇచ్చారు. అందులో అంగన్వాడీలకు కూడా జగన్ అనేక హామీలు ఇచ్చారు. ఒక్క హామీ నెరవేర్చక పోగా స్కీమ్ వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్వాడీలకు ప్రభుత్వ పథకాలు రద్దు చేయడం ఎంత వరకు సమంజసం. గతంలో చంద్రబాబు సర్కార్‌కు అంగన్వాడీలు సత్తా ఏమిటో చూపించారు. ప్రస్తుత ప్రభుత్వానికి ఆదే గతి పట్టకూడదంటే అంగన్వాడీల న్యాయమైన కోరికలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

# దూసుకొచ్చిన మృత్యువు

**కారును ఢీకొన్న లారీ**
**ఆరుగురు దుర్మరణం**
**మృతులంతా విజయవాడ వాసులు**

సంఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు

**ప్రజాశక్తి- శ్రీకాళహస్తి**

**వెంకన్న దర్శనం ముగించుకుని స్వస్థలానికి తిరిగి వెళుతున్న ఓ కుటుంబాన్ని లారీ మృత్యు రూపంలో కబళించింది. అతివేగంగా వస్తున్న లారీ కారును ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు దుర్మరణం పాలైన దుర్ఘటన ఆదివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని మిట్టకండ్రిగ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..**

విజయవాడ నగరం కృష్ణలంక ప్రాంతానికి చెందిన తుంగల రమేష్ కుటుంబం శుక్రవారం వెంకన్న దర్శనార్థం కారులో తిరుమలకు వచ్చింది. శనివారం వెంకన్న దర్శనం ముగించుకుని ఆదివారం స్వస్థలం విజయవాడలోని కష్ణలంకకు బయలుదేరింది. ఈక్రమంలో మదనపల్లి నాయుడుపేట జాతీయ రహదారి మిట్టకండ్రిగ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వేగంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న తుంగల రమేష్(48), ఆయన భార్య రాజ్యలక్ష్మి(40), వదిన శ్రీలత(42), స్నేహితులు రమణి(38), మూర్తి (47), మూర్తి కుమార్తె అక్షయ (16)అక్కడకక్కడే మృతి చెందారు. రమేష్ కుమారుడు భరత్ ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానిక సమాచారం మేరకు గాయపడ్డ భరత్‌ను 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిరుపతి ఏఎస్పి కులశేఖర్ తెలిపారు. లారీ వేగానికి కారు ముందుభాగం నుజ్జునుజ్జు కావడం, మృతదేహాలు చెల్లా చెదురు పడడంతో జాతీయ రహదారి రక్తసిక్తమైంది. సుమారు గంటపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

**రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి**

**నాగలాపురం:** మండలం సురుటుపల్లి చెక్‌పోస్ట్ సమీపంలో పుత్తూరు చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఊతుకోట నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదంలో నాగలాపురం మండలం జానికాపురం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పని చేస్తున్న సురేష్(31) సంఘటనా స్థలంలో మృతి చెందాడు. మరో వ్యక్తి జానికాపురం వాలంటర్ సతీష్ (25)కు తీవ్రయాలు కాగా మెరుగైన వైద్యం కోసం తమిళనాడు తిరువల్లూరు జిహెచ్ హాస్పిటల్‌కు తరలించినట్లు నాగలాపురం ఎస్ఐ హనుమంతప్ప పేర్కొన్నారు. సురేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నాగలాపురం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సురేష్

# వర్చువల్ విధానంలో ఒబెరాయ్ హోటల్‌కు భూమిపూజ

### శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

### మెరుగైన ఉపాధి అవకాశాలు : కలెక్టర్

**ప్రజాశక్తి- తిరుపతి టౌన్:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా గండికోట నుంచి ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ప్రతినిధులు విక్రమ్ ఒబెరాయ్, పర్యాటకశాఖ మంత్రి రోజా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి తదితరులతో కలిసి వర్చువల్ విధానంలో వైజాగ్, తిరుపతి పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఒబెరాయ్ లగ్జరీ హోటల్స్‌కు భూమిపూజా కార్యక్రమం నిర్వహించి శంకుస్థాపన చేశారు. తిరుపతి జిల్లా ఏపీ టూరిజంశాఖ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ (పేరూరు - అలిపిరి రోడ్డు) దగ్గర సదరు హోటల్‌కు కేటాయించబడిన ప్రాంతం నుండి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలమ్, జిల్లాకలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, జెసి డికె బాలాజీతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి ఆర్కే రోజా వర్చువల్‌గా కడప నుండి ప్రసంగిస్తూ నిబంధనల ప్రకారం రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్, నీటి సరఫరా, ఇతర ప్రోత్సాహకాలను అందించడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ వ్యవస్థాపకుల పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తోందని అన్నారు. కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరిస్తూ తిరుపతి జిల్లాలో తొలిసారిగా సెవెన్‌స్టార్ ఒబెరాయ్ లగ్జరీ హోటల్ అందుబాటులోకి వచ్చేల కషి చేసిన ముఖ్యమంత్రికి ముందుగా కతజ్ఞతలు తెలిపారు.

వర్చువల్ విధానంలో ఒబెరాయ్ హోటల్‌కు భూమిపూజ

తిరుపతి జిల్లాలో ఒబెరాయ్ హోటల్ ఏర్పాటుకు 20 ఎకరాలను సర్వే నం.604/9 పేరూరు గ్రామపరిధిలో, ఏపీ టూరిజంశాఖ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ (పేరూరు- అలిపిరి రోడ్డు) సమీపంలో కేటాయించడం జరిగిందనీ, ఈ ఒబెరాయ్ లగ్జరీ రిసార్ట్ హోటల్ నిర్మాణంలో భాగంగా 100 విలాసవంతమైన స్వతంత్ర విల్లాలు ఏర్పాటు కానున్నాయని, అలాగే మల్టీ కూజన్ వివిధ రకాల వంటకాలు, కాన్ఫరెన్స్ హాల్, బాంకెట్ హాల్, 24గంటలు కాఫీ షాప్, స్విమ్మింగ్ పూల్, ఫిట్నెస్ సెంటర్, స్టేట్‌ఆఫ్ ది ఆర్ట్‌స్పా, సావనీర్ దుకాణాలు పచ్చని ఆరుబయలు, పార్కింగ్ లాంటి మరెన్నో అత్యాధునిక సదుపాయాలతో తిరుపతి జిల్లా ప్రజలకు, ప్రపంచ నలుమూలల నుండి వచ్చే పర్యాటకులకు, యాత్రీకులకు అందుబాటులోకి రానున్నదని తెలిపారు. పర్యాటకరంగం అభివద్ధి వలన రాష్ట్ర ఆర్థిక అభివద్ధికి, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ప్రభుత్వం నుండి సదరు ఒబెరాయ్ లక్జరీ రిసార్ట్ హోటల్ ఏర్పాటుకు అందాల్సిన అన్ని అనుమతులు సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్షిత్ పేరూరు సర్పంచ్ కేశవులు, ఎంపీటీసీ చంద్ర మోహన్, జిల్లా పర్యాటకశాఖ ఆర్‌డి రమణప్రసాద్, ఎస్ఈ ఎస్పిడీసీఎల్ కష్ణారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, పర్యాటక కార్పొరేషన్ డివియం గిరిధర్, జిల్లా టూరిజం అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, టూరిజం ఈఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

# జిల్లాలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పర్యటన

### అప్రమత్తంగా ఏర్పాట్లు చేపట్టాలి: కలెక్టర్

**ప్రజాశక్తి- తిరుపతిటౌన్:** జాతీయ రహదారులు, రోడ్డు రవాణాశాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఈనెల జూలై 12,13న జిల్లాలో పర్యటించనున్నారని అందుకు తగిన ఏర్పాట్ల కొరకు అధికారులు వారికి కేటాయించిన విధులు సక్రమంగా అప్రమత్తంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జెసి డికే.బాలాజీ, జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, విజయవాడ రాకేష్ కుమార్ సింఘ్, పిడి జాతీయ రహదారులు నెల్లూరు దేవేశ్ గోయల్, తిరుపతి పిడి వెంకటేశ్వర్లులతో కలిసి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు, రోడ్డు రవాణాశాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి తాత్కాలిక పర్యటన షెడ్యూల్ మేరకు ఈ నెల 12న జిల్లాకు రానున్నరని, 13న ఉదయం తిరుపతి పట్టణంలోని తారక రామ స్టేడియంలో కష్ణపట్నం పోర్టు జాతీయ రహదారుల ప్యాకేజీ 2,3, 4 (పోర్టు కనెక్టివిటీ)కు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించి శంకుస్థాపన చేసి బహిరంగసభలో పాల్గొననున్నారని తెలిపారు. రేణిగుంట- నాయుడుపేట జాతీయ రహదారి ఎన్హెచ్-71 మార్గంలో ఆజాదీ కా అమత్ మహోత్సవ్‌లో భాగంగా దేశంలోని అన్ని జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయాల పరిధిలోని జాతీయ రహదారుల వెంబడి పెద్దఎత్తున సామూహిక మొక్కలు నాటే పాన్‌ఇండియా కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా రేణిగుంట ప్రాంతం నుండి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారని అందుకు తగిన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో పగడ్బందీగా జరిగేలా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కోదండ రామిరెడ్డి, ఎస్‌డిసి భాస్కర్ నాయుడు, తిరుపతి ఆర్‌డిఓ కనకనరసారెడ్డి, ఆర్డీవో శ్రీకాళహస్తి రామారావు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కష్ణారెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి సీతా రామిరెడ్డి పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు నిదర్శనం 'శ్రీజ'

### లక్ష్యాలను చేరుకున్న సభ్యులకు 9.83 కోట్ల బోనస్ : చైర్మన్ శ్రీదేవి

**ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):** పాడి రంగంలో చిత్తూరు జిల్లా కేంద్రంగా పనిచేస్తూ ప్రపంచంలోనే లక్ష మందికిపైగా సభ్యులు కలిగిన ఏకైక 'శ్రీజ' సంస్థ 10 సంవత్సరంలోకి అడుగు పెడుతూ సభ్యుల ఖాతాల్లోకి 10 కోట్ల రూపాయల బోనస్‌ను ఇస్తోంది. శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ అని త్వరలో సంస్థ 1000 కోట్ల టర్నోవర్‌ను సాధించబోతుందని సంస్థ చైర్మన్ కుంటపల్లి శ్రీదేవి తెలిపారు. మొత్తంగా 9.83కోట్ల రూపాయలను బోనస్‌గా చెల్లించనున్నారు. ఈ బోనస్‌ను చెల్లించడానికి ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. శ్రీజ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జయతీర్థచారి నేతృత్వంలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ సంస్థకు సంబంధించిన అన్ని లావాదేవీలను ఆన్లైన్ ద్వారానే జరుపుతూ నెలకు రెండుసార్లు తమ సభ్యుల బ్యాంకు ఖాతాలలో పాల బిల్లులను నేరుగా జమ చేస్తూ ఎక్కడా కరెన్సీ వాడకం లేకుండా ఆన్లైన్ పద్ధతి ద్వారానే కార్యకలాపాలను జరుపుతున్నామన్నారు. ఘన విజయాలను సాధించడానికి సహకరిస్తున్న ఎన్డీడిబి, ఎన్డీడిబి డైయిరీ సర్వీసెస్, మదర్ డైయిరీకి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కతజ్ఞతలు తెలిపారు.

**సాధారణ మహిళా రైతును చైర్మన్‌ను చేశారు**

**- కుంటపల్లి శ్రీదేవి, చైర్మన్ శ్రీజ సంస్థ**

మహిళా సాధికారతకు నిదర్శనం శ్రీజ సంస్థ. 2014 నుండి శ్రీజ సంస్థలో డైరెక్టరుగా చేస్తూనే మహిళల ఆర్థిక చైతన్యానికి ఊతమిచ్చే అవకాశాలను, ప్రోత్సాకాలను ఇచ్చారు. 2017 నుండి మహిళల ఖాతాల్లోకి మాత్రమే నగదు బదిలీ చేసేలా చర్యలు తీసుకున్నాం. గత రెండు సంవత్సరాలుగా చైర్మన్ హోదాలో సాధారణ మహిళా రైతుగా కొనసాగుతూ సంస్థకు పాలు పోసే వారికి మార్కెట్‌లో ఉండే పోటీధరను ఇవ్వడం చాలా సంతోషం అనిపించింది. 10వ ఏడాదిలోకి అడుగుపెట్టిన శ్రీజ సంస్థ 2025లో దేశంలోని టాప్ 10 డైయిరీలలో స్థానం సంపాదించాలనే లక్ష్యంతో పని చేస్తోంది.

**మహిళలదే నిర్ణయాధికారం...**

**- జయతీర్థాచారి, ఛీఫ్ ఎగ్జిక్యూటివ్, శ్రీజ సంస్థ**



పాడి మహిళా రైతులు... కేవలం రైతులుగా గానే కాకుండా సంస్థ నిర్వహిణ భాధ్యతల్లోనూ వారి భాగస్వామ్యం ఉండాలని ఇంటర్, డిగ్రీ వరకు చదివిన వారికి తగిన తర్ఫీదును అందించి వారిదే సంస్థలో నిర్ణయాధికారంగా చేశాం. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా శ్రీజ సంస్థలో పనిచేసేవారందరూ నిర్ణయాత్మక కార్యచరణతో భవిష్యత్తు ప్రణాళికలను సిద్దం చేసి దానివైపే ప్రయాణం అన్నట్టుగా ముందుకెళ్తున్నాం. శ్రీజ కుంటుంబంలో అందరి పాత్ర చాలా కీలకమైనది. అందరం శ్రీజ సంస్థ లక్ష్యసాధనలో కలిసి పనిచేస్తాం.

**మహిళల ఆర్థిక చైతన్యమే శ్రీజ లక్ష్యం....**

**- అమరేంద్రబాబు, కంపెనీ సెక్రటరీ, శ్రీజ సంస్థ**

సమాజంలో పాడి మహిళా రైతులను ఆర్థిక చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా శ్రీజ పనిచేస్తోంది. ఎంఎన్‌సి కంపెనీలలో పనిచేస్తూ 12 ఏళ్ళ అనుభవంతో 2014లో శ్రీజలో చేరాను. ఇక్కడ చేరిన తరువాత సంస్థ లక్ష్యం అర్థం చేసుకోని, దానికి అనుగుణంగా మరింత ఉత్సాహంతో మరిన్ని సంస్కరణలు తీసుకోచ్చాం. శ్రీజలో అందరికి సమాన పనులు, భాధ్యతలు ఉంటాయి. పాలకమండలి శ్రీజ అభివృద్ధి కోసం మంచి పాలసీ నిర్ణయాలను తీసుకొంటుంది. శ్రీజ గురించి చెప్పాలంటే అజ్ఞానం నుండి జ్ఞానం వైపు నడిపించేది గురువు అయితే... మహిళా సాధికారతకు, అభివృద్ధికి పాటుపడేది శ్రీజ అని చెబుతాను.

**కరోనా సమయంలో పాల సేకరణ ఆపలేదు**

**- ఎస్ఆర్.తిమ్మప్ప, డిప్యూటీ జనరల్ మేనేజర్, శ్రీజ సంస్థ**

ముఖ్య అవసరంగా ఉన్న పాలను కరోనా సమయంలో ఎక్కడా కూడా ఆగకుండా వినియోగదారులకు అందించాం. 2017లో శ్రీజలో చేరాను. 2014లో 41 వేల లీటర్లతో ప్రారంభమైన శ్రీజ నేడు దాదాపు 7లక్షల లీటర్లకు చేరుకుంది. ఎన్నో ఆటుపోట్లు మధ్య శ్రీజ మహిళా సాధికారత కోసం పనిచేస్తోంది. పల్లెలోని పాడి రైతులకు శ్రీజ మీ సంస్థ.... మీనమ్మకం అని.... వారి సహకారాన్ని అందిపుచ్చుకోగలిగాము. ఇన్నేళ్ళలో దాదాపుగా 5లక్షల మందికి మహిళా సాధికారత, ఆర్థిక అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాం.

**నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నాం....**

**- కె.రామమూర్తి, హెడ్-సేల్స్ మార్కెటింగ్, శ్రీజ సంస్థ**

శ్రీజ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడదు. పాల నుండి పాల ఉత్పత్తుల వరకు. ముఖ్యంగా శ్రీజ దైవిక స్వచ్ఛమైన ఆవునెయ్యి ప్రజలను చేరుకుంది. సామాన్య మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చిన్నపాటి ప్యాకెట్లలో నెయ్యిని అదే నాణ్యతతో అందిస్తున్నాం. 2017లో శ్రీజలో జాయిన్ అయ్యి సేల్స్‌ను పెంచడానికి తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఇప్పటికి 17 అవుట్ లెట్ల ద్వారా శ్రీజ ఉత్పత్తులు ప్రజలకు చేరువ చేసాం. దీన్ని భవిష్యత్తులో 50 పెంచాలనే లక్ష్యంతో ఉన్నాం. కరోనా సమయంలో పాల, పాల ఉత్పత్తులు రవాణా చేయడానికి ఇబ్బందులు ఎదుర్కోన్నాం. శ్రీజ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తుంది.

# టీడీపీ జెండాను విరిచిన వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-శాంతిపురం:** మండలం కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో నందమూరి తారక రామా రావు విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన తెలుగుదేశం పార్టీ జెండాలను, బ్యానర్లను కొంతమంది వైసిపి కార్యకర్తలు విరచడం, చించడంపై గత శని వారం రాళ్ళబుదుగురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు వారిపై కేసు నమోదు చేయలేదని స్థానిక టీడీపీ నాయకులు ఆదివారం శాంతిపురం బస్టాండు కూడలిలో తెలుగుదేశం పార్టీ నేతలు కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి వైసిపి ప్రభుత్వంపై నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు ఇందులో భాగంగా రహదారిపై భారీ ఎత్తున వాహన రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో దౌర్జన్యాలను పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకుండా ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ నేతలు అన్నారు. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేకపోతే నియోజకవర్గ స్థాయిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులతో ఏకమై ధర్నాకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వనాథ్ నాయుడు, పీవీ నాగరాజు, జనార్దన్ రెడ్డి, ఉదయ్ కుమార్, ఆర్ఎస్ మని, బసవరాజు, గోపాల్, రమేష్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## కళామందిరం సేవలు అమోఘం

**ప్రజాశక్తి-పలమనేరు:** తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నిర్మించిన కళామందిరం ద్వారా అమోఘమైన భాషా సేవ జరుగుతుందని నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం జాతీయ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ పేర్కొన్నారు. ఆదివారం కళామందిరం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ పిల్లలకు తల్లితండ్రులే విలువలను నేర్పించాలన్నారు. ప్రముఖ బాల సాహితీవేత్త డాక్టర్ హరికిసన్ మాట్లాడుతూ పిల్లలకు కథలు చెప్పడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. కథల ద్వారా మానసిక వికాసం కలుగుతుందని తెలిపారు. కళా మిత్రమండలి అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత రచయితలు, కవులపై ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన 50 మంది పిల్లలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికాలు అందించారు. డాక్టర్ లక్ష్మీ రాఘవ, సింహాద్రి జ్యోతిర్మయి, మూరి శెట్టి గోవిందు, సోమ సుందర్ రెడ్డి, ఈశ్వర్నాథ్, వి తిరుపతి, డివి మునిరత్నం ,పూసల రవి, చంద్రశేఖర్ నాయుడు, వెంకట రాఘవన్, వీరభద్ర గౌడ్, జనార్దన్ రావు, పలమనేరు బాలాజీ, సీతారామయ్య, సాధన, కుమార్‌లను వార్షికోత్సవం పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు తులసినాథం నాయుడు, పుష్ప, శివశంకర్ రెడ్డి గురుమూర్తి, సుదర్శన చారి, చిరంజీవి, మురళి, భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిరి కళాక్షేత్రంలో కూచిపూడి నాట్యరంగ ప్రవేశం

**ప్రజాశక్తి-కుప్పం:** గురువులు సునీత మహేష్ శిష్యులచే స్థానిక ఎస్వీ కల్యాణమండపంలో ఆదివారం సిరి కళాక్షేత్రం ఆధ్వర్యంలో కూచిపూడి నాట్య రంగ ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సీఐ శ్రీధర్, లయన్స్ క్లబ్ జోన్ ఛైర్ పర్సన్ ఎ.మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరి కళాక్షేత్రంలో శిక్షణ తీసుకుంటున్న కళాకారులకు సర్టిఫికెట్లను అందించారు. మొదటగా నటరాజ విగ్రహానికి పూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరు సంవత్సరాల శిక్షణ తీసుకొని కూచిపూడి నాట్యంలో ప్రావీణ్యం సాధించిన నలుగురు కళాకారులు సాంద్ర సింధు, కౌసల్య, భవ్యశ్రీ, రక్షియశ్రీ కూచిపూడి నాట్య రంగప్రవేశం చేశారు. అలాగే శిక్షణ ప్రారంభిస్తున్న 15 మంది చిన్నారులు గురు పూజ చేశారు. కుప్పం ప్రాంతంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను మన సంస్కృతి సాంప్రదాయాలు చిన్న వయసు నుండి పిల్లలకు నేర్పించడం వారి అభ్యున్నతికి, ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఇటువంటి కార్యక్రమాలను ముందుండి నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ఛైర్‌పర్సన్ మహేష్ సతీమణి సునీతను కుప్పం అర్బన్ సీఐ శ్రీధర్ కొనియాడారు. కార్యక్రమంలో కుప్పం లయన్స్ క్లబ్ కోశాధికారి పీజీ సెల్వం, డైరెక్టర్లు సెంథిల్ కుమార్, శివ, లెనిన్, విద్యార్థినులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాశక్తి-పుంగనూరు:** స్థానిక బిఎంఎస్ క్లబ్ ఆవరణలో లయన్స్ క్లబ్ నోబుల్, కుప్పం పిఇఎస్ మెడికల్ కళాశాల వారు సంయుక్తంగా ప్రతి నెలా రెండవ ఆదివారం ఉచిత వైద్య కంటి వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా లయన్స్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడు త్రిమూర్తి రెడ్డి, డిస్ట్రిక్ అంబాసిటర్ డా.శివ, లయన్స్ అంబాసిటర్ వరదా రెడ్డి, జోనల్ ఇన్‌ఛార్జ్ ముత్యాలు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి రెడ్డి మాట్లాడుతూ ఈ శిబిరంలో దాదాపు 60 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 20 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికైనట్లు తెలిపారు. కంటి చూపు తగ్గిన ప్రతి ఒక్కరూ ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి అమరావతి సురేష్, కోశాధికారి రజి అహ్మద్, లయన్ సతీష్ కుమార్ రాజు, లయన్ మహిపాల్ రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తులసినాథం నాయుడుకు బిరుదు

**ప్రజాశక్తి-పలమనేరు:** పలమనేరులోని వివిధ సామాజిక, సేవా, సాహిత్య సంస్థలు సంయుక్తంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమిత అధ్యక్షులు పి.తులసినాథం నాయుడుకు 'తెలుగు భాషాసేవా రత్న' బిరుదును ప్రదానం చేశాయి. ఆదివారం కళామందిరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఒక సంవత్సరం కాలంలో సుమారు వంద భాషా సాహిత్య కార్యక్రమాలు నిర్వహించిడం మాములు విషయం కాదని, అలాంటి కార్యక్రమాలను నిర్వహించినందుకు ఈ బిరుదును ఆయనకు ఇవ్వడం సముచితమన్నారు. కార్యక్రమంలో పలమనేరు బాలాజీయుగంధర్, కుమారస్వామిరెడ్డి, మాధవరెడ్డి, శివ, మల్లిచెట్ల దేవేంద్ర, యల్లంపల్లి నరేంద్ర, విమల మునిరత్నం పాల్గొన్నారు.

## జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

**ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం:** మండల కేంద్రమైన ఎస్ఆర్ పురంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని గంగాధర నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ అధ్యక్షులు డాక్టర్ పొన్న యుగంధర్, మండల పార్టీ అధ్యక్షులు చిరంజీవి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పొన్న యుగంధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై, ప్రజా క్షేమానికి ఎల్లప్పుడూ ప్రజలకు అండగా నిలుస్తున్న పార్టీ జనసేన పార్టీ అని, సమస్యలు ఎక్కడ ఉంటే జనసేన పార్టీ అక్కడ ఉంటుందని అన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేని డిప్యూటీ సీఎం నారాయణ స్వామిని జరగబోయే ఎన్నికల్లో ప్రజలు ఇంటికే పరిమితం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాఘవ, హరి, బాలరాజు, నరేష్, సాయి, భరత్, అవినాష్, చార్లెస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చే ప్రభుత్వాన్ని ఆదరించండి

**ప్రజాశక్తి-వి.కోట:** ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రభుత్వాన్ని ఆదరించాలని పలమనేరు శాసనసభ్యులు వెంకటే గౌడ పిలుపునిచ్చారు. ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గోను మాకులపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని చిన్న శ్యామ, నాగిరెడ్డిపల్లి గ్రామాలలోని ప్రతి గడపను ఆదివారం వారు సందర్శించారు. అనంతరం ఆయన ప్రతి గడపలోని సమస్యను అడిగి తెలుసుకుని, ప్రభుత్వపరంగా వారికి చేకూర్చిన లబ్ధిని వివరించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం సంక్షేమ పథకాల అమలపై ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలను ఆర్థికంగా బలోపేతం చేయాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్ రెడ్డి, తమీంఖాన్, పార్టీ కన్వీనర్ బాలగురునాథ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు సకాలంలో డీఏలు ఇవ్వాలి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి జీపీఎస్‌ను తీసుకురావడం, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని.. కనీసం డీఏలు సకాలంలో ఇవ్వడం లేదని ఎన్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రెడ్డి రమేష్ అన్నారు. ఆదివారం తిరుపతి రాస్ భవనంలో తిరుపతి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని పి.రామమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి రమేష్ మాట్లాడుతూ పిఆర్‌సి బకాయిల విషయంలో గందరగోళం నెలకొనడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని, ప్రభుత్వం ఉద్యోగులపై సానుకూల వైఖరితో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌టిఏ చిత్తూరు జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ మాట్లాడుతూ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌ల పోస్టులను ప్రమోషన్స్‌తో భర్తీ చేయాలన్నారు. జిపిఎఫ్ రుణాలు మునుపటిలాగా దరఖాస్తు చేసుకున్న 15 రోజుల లోపు ఇవ్వాలన్నారు. సమావేశంలో సిపిఎస్ నాయకులు సుధాకర్, ఎల్లం నాయుడు, రమణ, గంగాధర్, నాగేశ్వరరావు, హేమకుమార్, రవికుమార్, మురళీ, రమేష్, రామకృష్ణ, వెంకటేశులు, రెడ్డి శేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కృషి ఫలితమే పశువైద్య విశ్వవిద్యాలయం

**ప్రజాశక్తి-క్యాంపస్:** శ్రీ వేంకటేశ్వర విద్యాలయం విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందని విస్తరణ సంచాలకులు డాక్టర్ జి వెంకట్ నాయుడు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విషయం విద్యాలయంలో నియంత్ర పశువైద్య విద్యా, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఉత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పశువైద్యాన్ని మెరుగుపరిచేందుకు, పశుసంవర్ధక, పశుపోషణ కార్యక్రమాలను విస్తత పరిచేందుకు తిరుపతి ప్రధాన కేంద్రంగా శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయాన్ని ఆయన ఏర్పాటు చేశారని కొనియాడారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డికి అనన్య సామాన్యమైనదని అన్నారు. ఈ సందర్భంగా డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జివి. రమణ, సిసివిఈసి కోఆర్డినేటర్ డాక్టర్ కే. సుజాత, డిప్యూటీ రిజిస్ట్రర్ రామ్మోహన్ తదితరులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పశువైద్య విద్యా సమాచార కేంద్రం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఇంద్రసేనమ్మ చేయూత

**ప్రజాశక్తి-గూడూరు టౌన్:** గూడూరు పట్టణంలోని డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ దాతృత్వంతో సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి దివ్యాంగులకు ఆదివారం ఫల సరుకులు పంపిణీ చేశారు. సిద్దారెడ్డి ఇంద్ర సేనమ్మ మాట్లాడుతూ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన పేరు మీదుగా సిద్ధారెడ్డి దివ్యాంగులకు చేయూతనివ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ సేవా దక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. అనంతరం కొత్తపల్లి సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలకు ప్రాణం పోసినటువంటి సిద్ధారెడ్డి జనార్ధన్ రెడ్డి, వారి కుటుంబానికి రెడ్డి సంక్షేమ సంఘం ఎప్పుడు రుణపడి ఉంటుందని, ఆయన సేవలు ఎనలేనివి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ధనుంజయ రెడ్డి, కార్యదర్శి ప్రజేంద్ర రెడ్డి, సంఘ ప్రతినిధులు మండి శ్రీనివాసులు రెడ్డి, హరినాథ్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సిద్ధారెడ్డి, భాస్కర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'వాకర్స్'తో సేవా కార్యక్రమాలు చేయాలి

**ప్రజాశక్తి-పుత్తూరు టౌన్:** నడకతో పాటు సేవా కార్యక్రమాలను చేసేందుకు కృషి చేయాలని నగరి కమిషనర్ వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశాన్ని అధ్యక్షుడు రామచంద్ర నాయుడు, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవిరాజు, వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ముఖ్యమైన కార్యక్రమాలు చేపడుతోందని.. చాలా సంతోషకరమన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని తెలిపారు. డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ సీజన్‌లో డెంగీ వచ్చే అవకాశం ఉందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## సేవకునికి సన్మానం

**ప్రజాశక్తి-పలమనేరు:** ప్రజా సమస్యలే ప్రాణంగా కుల, మతాలకు అతీతంగా మానవ హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నడిపిస్తూ అహర్నిశలు కృషి చేస్తున్న జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డివి మునిరత్నంను గంగవరం తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా గంగవరం సాయి గార్డెన్ సిటీ ఆవరణలో ఏర్పాటుచేసిన తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి ప్రథమ వార్షికోత్సవ సభను ఆ సమితి వ్యవస్థాపకులు తులసి నాదం నాయుడు అధ్యక్షతన పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. ఆ సభకు వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కవులు, రచయితలు, కళాకారుల సమక్షంలో జాతీయ మానవ హక్కులు సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి.మునిరత్నం నిరంతరం అలుపెరగకుండా చేస్తున్న సేవలను గుర్తించి వార్షికోత్సవ సందర్భంగా సన్మానించి మెమెంటోను అందజేశారు. అదేవిధంగా జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులకు అక్కడికి వచ్చిన మేధావులు అందరూ అభినందనలు తెలిపా రు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాటలు, తెలుగు పద్యాలు, నత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మేధావులకు సన్మానాలతో పాటు 25 మంది విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

## వైభవంగా దుర్యోధన వధ

**ప్రజాశక్తి-సోమల:** మండల కేంద్రమైన చదువు సమీపంలోని బట్టువారిపల్లి భారత మెట్ట వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞంలో ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. దుర్యోధన, అర్జున పాత్రదారులు ఇరువురు పలు పద్యాలను, గేయాలను ఆలపిస్తూ భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన భారీ దుర్యోధన మట్టి విగ్రహాన్ని వధించి భక్తులకు మట్టిని అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## నేడు 'మనసిస్తావా' చిత్రం విడుదల

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** నేడు సమాజంలో యువత ప్రతి చిన్న విషయాలకు ఆత్మహత్యలకు వైపు వెళ్తూ కన్న వారికి కడుపుకోతను మిగుల్చుతున్నారని, ఆత్మహత్య ఎంత తప్పిదమో చెప్పే చిత్రం మనసిస్తావా చిత్రం అని చిత్ర దర్శకులు రవిచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర బృందం మాట్లాడుతూ తిరుపతిలోని యువత, కళాకారులను ప్రోత్సహించడానికి ఈ చిన్న చిత్రంతో సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తున్నామన్నారు. కోటి రూపాయల ఖర్చుతో నిర్మించిన ఈ చిన్న చిత్రాన్ని సోమవారం థియేటర్లలో విడుదల అయ్యో మనసిస్తావా సినిమాను ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నిర్మాతలు శివారెడ్డి, నక్కా రాజేంద్రప్రసాద్, నటులు కృష్ణమూర్తి, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లిమంద గ్రామ సేవకుడు మృతి

**ప్రజాశక్తి-సోమల:** మండలంలోని నెల్లిమంద పంచాయతీ గ్రామ సేవకుడుగా పనిచేస్తున్న వెంకటరమణ (61) అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. మరణవార్త తెలిసిన వెంటనే డీటీ ప్రకాష్ బాబు సంఘటనా స్థలానికి వెళ్లి వెంకటరమణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తహశీల్దార్ శ్యాం ప్రసాద్ రెడ్డి మతుడి కుటుంబానికి అంత్యక్రియలకు రూ.25వేల నగదును డిటి ప్రకాష్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సేవకులు రామకృష్ణ, యువరాజ్, వీఆర్వో వెంకటరమణ, పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బావిలో గుర్తుతెలియని మహిళ శవం

**ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి:** బైరెడ్డిపల్లి-పుంగనూరు జాతీయ రహదారిలోని లక్కనపల్లి గ్రామ సమీపాన బీరప్ప గారి వెంకటప్ప వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మహిళ శవం లభ్యమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. దీన్ని స్థానికులు గుర్తించి విఆర్‌ఒ వెంకటేష్‌కు తెలియపరచగా అతను ఎస్సై వెంకట నరసింహులుకు సమాచారం ఇవ్వగా ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని మహిళ మతదేహాన్ని బావిలో నుండి బయటకు తీయించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఆ మృతదేహాన్ని చుట్టుపక్కల వారు ఎవరూ గుర్తించలేదు, ఆమెకు సుమారు 47 సం. వయస్సు ఉంటుందని, చామనచాయ రంగుతో శారీ డిజైన్ జాకెట్ కలిగి ఉన్నట్లు, ఆమె వద్ద ఉన్న బ్యాగ్‌లో చిన్న పాప ఫోటో ఒకటి ఉందని, మెడలో తాళిబొట్టు, చెవిలో బంగారు కమ్మలు, కాళ్లకు సైనాలు ఉన్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. విఆర్‌ఒ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## విద్యార్థినికి ఆర్థిక చేయూత

**ప్రజాశక్తి-ఓజిలి:** ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించిన గోకర్ణ శతికి వైసీపీ సీనియర్ నాయకుడు పాల్చూరు పెద్ద చంగయ్య యాదవ్ రూ.10 వేలు ఆర్థిక చేయూతనిచ్చారు. ఓజిలి మండలం అత్తివరం గ్రామపంచాయతీ పరిధిలోని కారూరు గ్రామంలో ఇంటర్ పరీక్ష ఫలితాలలో 983 సాధించిన విద్యార్థిని ఉన్నత విద్యకు ఆర్థిక సహాయంగా పెద్ద చెంగయ్య శ్రీధర్ రెడ్డి, అమరేంద్ర యాదవ్ చేతుల మీదుగా నగదును అందజేశారు. ప్రతి ఏడాది వైయస్సార్ జయంతి రోజు పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని పాల్చూరు అమరేంద్ర యాదవ్ తెలిపారు.

## ధర్నా విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి-వెంకటగిరి:** కలెక్టరేట్ ఎదుట ధర్నా విజయవంతం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వెంకటగిరి ప్రాజెక్టు అధ్యక్షులు మంజుల కోరారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యాండ్‌పాలెం వద్ద విలేకర్లతో మాట్లాడారు. సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల కోర్కెల దినం సందర్భంగా జూలై 10, 11 తేదీలలో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 36 గంటల పాటు కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొనాలని కోరారు.

## డ్యాం నిర్మాణం చేపడితే అడ్డుకుంటాం

**ప్రజాశక్తి-కార్వేటినగరం:** మండలంలోని కత్తిరపల్లె వద్ద నూతన డ్యాం నిర్మాణం చేపడితే అడ్డుకుంటామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డా.థామస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం మండలంలోని దాసరి నెత్తం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో థామస్ మాట్లాడుతూ రైతులకు టిడిపి అండగా ఉంటుందని, 38 కిలోమీటర్ల దూరంలో కష్టాపురం రిజర్వాయర్ ఉండటంతో రైతుల పొలాలు సస్యశ్యామలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇక్కడ డ్యాం నిర్మాణం చేపడితే దాదాపు 9 గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతారని, అందువల్ల నిలిపివేయాలని సూచించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి తప్ప నష్టం జరగకుండా చూడాలన్నారు. డ్యాం నిర్మిస్తే గ్రామంలోని 32 ఇళ్ల కుటుంబాలు రోడ్డున పడతారని దుయ్యపట్టరు. కార్యక్రమంలో జీడీ నెల్లూరు టిడిపి కోఆర్డినేటర్ చిట్టిబాబు నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గుండయ్య, రాష్ట్ర రైతు కార్యనిర్వాక కార్యదర్శి జనార్ధన్ రాజు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నాగేశ్వరరాజు, పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్..

**గంగాధర నెల్లూరు:** రాజధాని లేని రాష్ట్రంగా ఉందంటే అది ఆంధ్రప్రదేశ్ ఒకటేనని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ అన్నారు. జీడీ నెల్లూరులో ఆదివారం టీడీపీ కార్యకర్తలు, నేతలకు ఇన్‌ఛార్జ్ థామస్ పరిచయ వేదిక కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకుడు వారి వంతు కృషి చేస్తే తన గెలుపు సునాయాసం అవుతుందని తెలిపారు. నేను ఏ ఒక్క నాయకుడి మనిషి కాదని, అందరివాడిగా కలిసిమెలిసి పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మనోహర్ నాయుడు, నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ భీమనేని చిట్టిబాబు నాయుడు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి సురేంద్ర కుమార్, టీడీపీ మండల అధ్యక్షులు స్వామిదాస్, రుద్రయ్య నాయుడు, చెంగల్ రాయ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### యువ డాక్టర్ మధురెడ్డి కుటుంబానికి పరామర్శ

**వెదురుకుప్పం:** మండలంలోని యనమలమంద పంచాయతీ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన యువ డాక్టర్ బోడిరెడ్డి మధురెడ్డి కుటుంబాన్ని ఆదివారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ పరామర్శించి, వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్గించారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు భీమనేని చిట్టిబాబు నాయుడు, నియోజకవర్గ ఎస్.సి సెల్ అధ్యక్షుడు గుండయ్య, వెదురుకుప్పం టిడిపి మాజీ మండల అధ్యక్షులు పి.మోహన్ మురళి, టిడిపి మండల అధ్యక్షులు కే లోకనాథ్ రెడ్డి, పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి బిగాల రమేష్ తదితరులు ఉన్నారు.

## కృతజ్ఞతలు తెలిపిన మండల రీసోర్స్ కోఆర్డినేటర్లు

**ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి:** సాక్షర భారత్‌లో మండల కోఆర్డినేటర్స్‌గా పనిచేస్తూ గత ప్రభుత్వంలో తొలగింప బడిన వారికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మండల రిసోర్స్ కోఆర్డినేటర్లు గా ఉద్యోగాలు కల్పించారు. ఈ నేపథ్యంలో వారికి ఉద్యోగాలు రావడానికి కృషిచేసిన డిసిసిబి ఛైర్మన్ యం.రెడ్డమ్మ కష్ణమూర్తి, బైరెడ్డిపల్లి ఎంపీపీ యం. రెడ్డెప్పను ఆదివారం పలమనేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల మండల రీసోర్స్ కోఆర్డినేటర్లు కలిసి కండువా కప్పి, పూలమాల వేసి కృతజ్ఞతలు తెలి పారు. కార్యక్రమంలో మండల రీసోర్స్ కోఆర్డినేటర్స్ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధారెడ్డి (పలమనేరు), ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు సుధాకర్ (పెద్దపంజాణి), సురేష్ బాబు, సోమశేఖర్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**నోటీసు**

**మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి-కం-మోటారు యాక్సిడెంట్స్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్-పశ్చిమ గోదావరి జిల్లా**

**M.V.O.P.No.102/2022**

*బిట్వీన్:*
కొల్లాబత్తుల స్వర్ణలత & 3గురు ...పిటీషనర్లు
మరియు
చిల్ల చిట్టి & 5గురు ...రెస్పాండెంట్లు

*టు: 4 టు 5 రెస్పాండెంట్లు:*
**4)** కృష్ణప్ప వెంకటరామప్ప చిట్టిబాబు, తండ్రి: వెంకట రామప్ప, నివాసం: తోట కనుమ గ్రామం, వి.కోట మండలం, చిత్తూరు జిల్లా.
**5)** యస్.గౌస్ షారీఫ్, తండ్రి: లేటు ఖలీల్, నివాసం: డో.నెం.8-73/2, హనుమేపల్లె, వెంకటగిరికోట, వి.కోట మండలం, చిత్తూరు జిల్లా.

పై నెంబరు పిటీషనులో 4 & 5 రెస్పాండెంట్లు అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిచుచున్నప్పటికీ వాటిని మీరు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపించుచున్నందున, నోటీసులు మీకు సబ్‌స్టిట్యూట్ సర్వీసు ద్వారా అమలుపరచుటకు ఉత్తర్వులు ఇచ్చినందున పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది. కావున **ది.08-08-2023 వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి ఉన్నది.** ఆరోజున మీరు స్వయంగా గాని లేద వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

***వాయిదా తేదీ: 08-08-2023***

**యం.శ్రీనివాసరావు**
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 94905 35676
కొవ్వూరు,
09-07-23.